క్లుప్తంగా

పరిశుభ్రత పాటించండి..



పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ పి.సీతారామ్

సత్తుపల్లిటౌన్: ఈ సీజన్‌లో వ్యాధులు రాకుండి ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్ఓ పి.సీతారామ్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంగారం పీహెచ్‌సీ వైద్యులు అవినాష్, ఏఎన్ఎం మరియమ్మ పాల్గొన్నారు.

టీకాలు వేయాలి



బాలింత టీకా కార్డును పరిశీలిస్తున్న డాక్టర్ ప్రశాంత్

మధిరరూరల్: మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా చిన్నారులకు, గర్భిణులకు నూరుశాతం టీకాలు వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలోని కన్సల్టెన్సీ వైద్యుడు ప్రశాంత్ కోరారు. మండలంలోని దెందుకూరు, మడుపల్లి గ్రామాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. దెందుకూరు దళిత కాలనీలో బాలింత టీకాల కార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో దెందుకూరు పీహెచ్‌సీ వైద్యుడు పృథ్వీరాజ్ నాయక్, సిబ్బంది గోవింద్, సుబ్బలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ.35 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వాస్పత్రి పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నాణ్యతాపరంగా ఎటువంటి లోపాలు లేకుండా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అద్దంకి అనీల్, పర్వతనేని వేణు, కోట రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ అజయ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

మధిర: ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయకముందే ప్రస్తుతం ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ఆర్టీసీ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు గోపాలకృష్ణ, వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన వారికి బకాయిలతో పాటుగా పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఏరియర్స్ చెల్లించాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

మధిరరూరల్: మండలంలోని జిలుగుమాడు గ్రామంలో మాటూరుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ భాస్కరరావు, వైద్యులు శ్రీనివాసరావు, సిబ్బంది ప్రదీప్, శరత్ బాబు, సత్యవాణి, శోభారాణి, శిరోమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సాయుధ పోరాట ఘనత కమ్యూనిస్టులదే..

చింతకాని: తెలంగాణ సాయుధ పోరాటం కమ్యూనిస్టులదేనని సీపీఐ మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు అన్నారు. మండలంలోని పొద్దుటూరులో 16 నుంచి ఈ వారోత్సవాలను నిర్వహిచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ పెద్దలు పాల్గొంటారని, కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

తల్లాడ: తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయనున్న స్థలాన్ని శుక్రవారం టీడీపీ ఖమ్మం జిల్లా పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ చంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజుల్లోనే ఎన్టీఆర్ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, లక్ష్మణ్, విజయ్, పృథ్వీ, గోపిరెడ్డి పాల్గొన్నారు.

అయ్యో.. పాపం ఎంపీటీసీలు

- ఉత్సవ విగ్రహాలుగా మారిన వైనం..
- గ్రామాల్లో తలెత్తుకోలేని పరిస్థితి
- నిధులు కేటాయించాలని డిమాండ్

ఎంపీటీసీలు గెలిచినంత ఊపు ఆ తరువాత లేదు. లక్షలు ఖర్చుపెట్టినా.. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్న ఎంపీటీసీలను చూసి గ్రామాల్లోని ప్రజలు అయ్యో.. పాపం ఎంపీటీసీలు గెలిచారు కానీ వారికి ప్రభుత్వం ఎటువంటి నిధులు కేటాయించలేదని చర్చించుకుంటున్నారు. అధికార పార్టీ ఎంపీటీసీలు అయితే 'అన్నీ ఉండి అల్లుడి నోట్లో శని'అన్న చందంగా ఉందని వారు వాపోతున్నారు.



కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయం

కొణిజర్ల: ఎంపీటీసీ సభ్యులుగా గెలిచి నాలుగేళ్లు నిండింది. ప్రభుత్వం నుంచి ఎంపీటీసీలకు ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామాల్లో తమకు ఓట్లేసి గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. కొణిజర్ల మండలంలో మొత్తం 27 పంచాయతీలుండగా 15 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. 2019 మేలో ఎన్నికలు జరిగి గెలిచిన తర్వాత ఆగస్టులో ఎంపీటీసీలు పదవీ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ప్రభుత్వం ఎంపీటీసీలకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. అప్పుడప్పుడు విడుదల చేస్తున్న జిల్లా పరిషత్ నిధులతో అరకొర పనులు చేస్తున్నారు.

పేరుకే సమావేశాలు..

ప్రతీ మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు హాజరవుతుంటే.. అధికారులు ఇచ్చే టీ, బిస్కెట్ల కోసం హాజరవుతున్నట్లుగా ఉందని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ మండల పరిషత్ సమావేశాల్లో ఒకరిద్దరు ఎంపీటీసీ సభ్యులు సమస్యలపై చర్చ లేవనెత్తినా పట్టించుకునే వారు కరువయ్యారు. సమస్యల పరిష్కారం నేటికీ ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో తామంతా కేవలం గ్రామాలల్లో ఉత్సవ విగ్రహాలులా సభలు, సమావేశాలకు వెళ్లి వేదికలపై కూర్చుని రావడం తప్ప వేరే పని లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో అధికార పార్టీ ఎంపీటీసీ సభ్యులకు కొద్దో గొప్పో నిధులు వచ్చేవి కానీ ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ వచ్చిన తర్వాత తన పర భేదం లేకుండా ఒక్కరికి కూడా నిధులు రావడం లేదు. దీనికి తోడు ఎంపీటీసీ సభ్యులకు ప్రతి నెలా వచ్చే గౌరవ వేతనం కూడా సరిగా రావడం లేదు. కనీసం ఉన్న ఈ ఆరు నెలల కాలంలో అయినా ఎంపీటీసీలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తే తమకు గ్రామాల్లో గౌరవం పెరుగుతుందని ఎంపీటీసీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది..



ఎంపీటీసీలుగా గెలిచి నాలుగేళ్లు గడిచినా ఇప్పటి వరకు గ్రామాల్లో ఎటువంటి పనులు చేయించలేక పోయాం. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంపీటీసీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. నిధులు కోసం ఎన్నిసార్లు ప్రభుత్వానికి నివేదించినా ఫలితం లేకుండా పోయింది. ఎంపీటీసీలుగా పోటీ చేయాలని ఆసక్తి కూడా లేకుండా పోతుంది.

– గోసు మధు, ఎంపీపీ, కొణిజర్ల

నా జీవితం ప్రజాసేవకే అంకితం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్

ఏన్కూరు: ఓడినా.. గెలిచిన ప్రజల మధ్యలోనే ఉంటూ... నా జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేస్తానని వైరా మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ అన్నారు. వైరా నియోజకవర్గ అభ్యర్థిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా ఏన్కూరు వస్తున్న మదన్‌లాల్‌కు మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. జన్నారం క్రాస్ రోడ్డు నుంచి ప్రధాన రహదారి మీదుగా కమ్మవారి కల్యాణమండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరాలో బీఆర్ఎస్‌ను గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. తనకు అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్, మంత్రి పువ్వాడలకు కృతజ్ఞతలే తెలిపారు. ఈ సందర్భంగా పలు పార్టీల నుంచి వచ్చిన కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బుజ్జి, ఎంపీటీసీ వెంకటేశ్వరావు, సర్పంచ్ రుక్మిణి, ఉప సర్పంచ్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ఎర్రుపాలెం: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ శిరీష, జెడ్పీటీసీ కవిత

ఎర్రుపాలెం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ శిరీష అన్నారు. శుక్రవారం మండలంలోని మామునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్-17 మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ఎంపీపీతో పాటుగా జెడ్పీటీసీ శీలం కవిత, ఎంఈఓ ప్రభాకర్ రావులు ప్రారంభించారు. తొలుత జాతీయ జెండాను ఎంపీపీ, క్రీడల పతాకాన్ని జెడ్పీటీసీ ఆవిష్కరించారు. క్రీడాకారులు గౌరవ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజ్ సెక్రెటరీ పీఈటీ జమలయ్య, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎంలు జగదీష్, భూమయ్య, పుల్లమ్మ, పీఈటీలు శ్రీనివాసరెడ్డి, చిన్ని, సత్యనారాయణరెడ్డి, సాంబశివారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెంలో గల మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను స్థానిక ఎస్సై శంకరరావు, ఎంఈఓ మోదుగు శ్యాంసన్ పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. మొదటి రోజు బాలికల అండర్-14, అండర్-17 విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. విజేతలకు అమ్మపాలెం సర్పంచ్ నాగేంద్రమ్మ బహుమతులు అందజేశారు.

ముగిసిన క్రీడాపోటీలు..

ఏన్కూరు: స్థానిక గురుకుల విద్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిసాయి. రెండో రోజు బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో మున్సిపాలిటీ



మల్లు నందిని విక్రమార్కకు సమస్యలు తెలుపుతున్న వ్యాపారులు

మధిర: మధిర మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతోపాటు అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అమ్మ ఫౌండేషన్ చైర్మన్, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని విక్రమార్క తెలిపారు. శుక్రవారం మధిర పట్టణంలో ఆమె విస్తృతంగా పర్యటించారు. సమీకృత మార్కెట్‌ను పరిశీలించిన ఆమెకు.. వ్యాపారులు, రైతులు వారి సమస్యలను చెప్పుకున్నారు. నెలకు రూ.3వేలు అద్దె చెల్లించాలంటే భారమవుతుందని, కనీసం మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు లేవని, విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉండటంవల్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కూరగాయల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు పరిశబోయిన సాంబయ్య మాట్లాడుతూ.. నెలకు మున్సిపాలిటీకి మూడువేలు కాకుండా వెయ్యి రూపాయలు మాత్రమే అద్దె చెల్లిస్తామని, ఖాళీగా ఉన్న దుకాణాలను కూడా వెంటనే భర్తీ చేయాలని కోరారు. అక్కడ నుంచి స్థానిక ఎస్‌బీఐ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చిరు వ్యాపారుల దుకాణాలను పరిశీలించారు. సీసీ రోడ్లు లేకుండా ఇరుకుగా ఉండడంతో ఇబ్బందిగా ఉందని, దీనికి తోడు బేరాలు లేక ఇబ్బందులు పడుతుండే అధికారులు మాత్రం వెయ్యిరూపాలయు అద్దె చెల్లించాలని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. అక్కడ నిర్మించిన మరుగుదొడ్లకు తాళాలు వేసి మూడు సంవత్సరాలు గడిచిందని, నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యలపై మల్లు నందిని విక్రమార్క స్పందిస్తూ.. మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్‌రెడ్డి, దారా బాలరాజు, దుంపా వెంకటేశ్వరరెడ్డి, బాణావత్ వెంకటరమణ నాయక్, షేక్ జహంగీర్, మున్సిపల్ కౌన్సిలర్ ఎర్రగుంట లక్ష్మి, పారుపల్లి విజయ్ కుమార్, యన్నం కోటేశ్వరరావు, నిడమానూరు వంశీకృష్ణ, పత్తేపురపు సంగయ్య, రాజేంద్ర, మహమ్మద్ రహీం, తలుపుల వెంకటేశ్వర్లు, మోదుగు బాబు, కోట డేవిడ్, అక్కినపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

బోనకల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మి.. ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మల్లు నందిని అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురంలో బూత్‌లెవల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె సమక్షంలో పలు పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధీర్‌బాబు, మండలాధ్యక్షుడు దుర్గారావు, కిషోర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావులపై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ కమల్‌రాజ్

ముదిగొండ: సీఎం కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. శుక్రవారం ముదిగొండలోని సర్పంచ్ లక్ష్మి, ఎర్రవెంకన్న నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధిలో ముందుకు సాగుతున్న కేసీఆర్, హరీశ్‌రావులపై విమర్శలు చేయడం భట్టి విక్రమార్కకు సరికాదన్నారు. సమావేశంలో ఎంపీపీ హరిప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

సన్మానం..

ముదిగొండ: మండలంలోని మేడేపల్లిలో శుక్రవారం జరిగిన కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుగుణతో పాటు డైరెక్టర్‌లను జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్, మేడేపల్లి సహకార సొసైటి చైర్మన్ వెంకటయ్య, సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని తల్లాడ టౌన్ ఫీడర్, కుర్నవల్లి ఫీడర్‌లో శనివారం మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తల్లాడ, కుర్నవల్లి సెక్షన్ల విద్యుత్ ఏఈలు రాజేష్, సుందర్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

కల్లూరురూరల్: కుర్నవల్లి ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా పెద్దకోరుకొండి, మిట్టపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పెద్దకోరుకొండి ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

తల్లాడ: బాలపేటలో గురువారం రాత్రి ఇతర పార్టీలకు చెందిన పలు కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరినట్లు తల్లాడ ఎంపీపీ శ్రీనివాసరావు ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట నరసింహారావు, నాయకులు చిన్న శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, దేవేందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు శిక్షణ

కల్లూరు: కల్లూరు, తల్లాడ, ఏన్కూరు మండలాల ఆశా కార్యకర్తలకు శుక్రవారం స్థానిక రైతు వేదికలో ఆయూష్మాన్ భవ కార్యక్రమంపై శిక్షణ జరిగింది. ఈ శిక్షణలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు, టెలీ మెడిసెన్, గ్రామ సభలు, క్షయ నిర్మూలన, మాత శిశు సంరక్షణ, అసంక్రమిత వ్యాధులు, మానసిక ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నవ్యకాంత్, సీహెచ్ఓ రేవతి, శిక్షకులు రాజేశ్వరి, కళావతి, మల్లీశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు రామారావు, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

లింగస్వామికి సన్మానం

సత్తుపల్లి: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు లింగస్వామి మాదిగను కోటూరి మానవతారాయ్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శరత్, కృష్ణ, ఏడుకొండలు, అవినాష్, కిరణ్ పాల్గొన్నారు.

విజయభేరి సభను జయప్రదం చేయండి



వైరా: మాట్లాడుతున్న రంగారావు, రామ్మూర్తి

వైరా/ఏన్కూరు: ఈ నెల 17న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే విజయభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాల దుర్గాప్రసాద్, పీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, పీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి నాయక్, పిలుపునిచ్చారు. శుక్రవారం వైరా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, ఏన్కూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాల తెలంగాణ కలను సోనియాగాంధీ నెరవేర్చారని, సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపేందుకు విజయభేరి సభను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సంతోష్, నాగరాజు, నాగేశ్వరరావు, రంగారావు, గోవిందరావు, వీరబాబు, భాస్కర్, రామకృష్ణ, కిరణ్, కాంగ్రెస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకుడు మాలోత్ రాందాసు నాయక్, బానోత్ విజయభాయి, బానోత్ బాలాజీ, ధరావత్ రామ్మూర్తి నాయక్, డానియల్, వడ్డె నారాయణ, వెంకట నర్సిరెడ్డి, స్వర్ణ నరేందర్, చంద్రప్రకాష్, మంగీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు పంపిణీ



రుణాలు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ సాంబశివరావు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం సొసైటీ పరిధిలోని కొత్త సభ్యులు 23 మందికి రూ.23 లక్షల నగదును, రుణమాఫీ పొందిన 32 మంది సభ్యులకు 17.42లక్షల నగదును మండల కేంద్రంలోని కోఆపరేటివ్ బ్యాంకు కార్యాలయంలో సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు డీసీసీబీ మేనేజర్ మగినం వీరభద్రరావులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, భానుప్రియ, సీఈఓ మోహన్‌రావు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

చింతకాని: మండలంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం పర్యటించనున్నందున విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గాంధీనగర్‌కాలనీలోని పంచాయతీ భవనంతో పాటుగా కొదుమూరు, నేరడ గ్రామల్లో నూతనంగా నిర్మించిన పల్లె దావఖానాలను ప్రారంభిస్తారన్నారు. అదేవిదంగా ఏపీ మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా మధిరలో నేడు ఉదయం ర్యాలీ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతి కిషోర్, ఎంపీపీ పూర్ణయ్య, వైస్ ఎంపీపీ హనుమంతురావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ రత్నాకర్ పాల్గొన్నారు.

జిల్లాలో కాంగ్రెస్‌దే పై చేయి

ముదిగొండ: ఖమ్మం జిల్లాలో తుమ్మలదే పై చేయి అని సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి పేర్కొన్నారు. ముదిగొండలోని తహసీల్ ఎదుట శుక్రవారం తుమ్మల అనుచరుడు యలగొండస్వామి, బీఆర్ఎస్ నాయకులకు కొంత సేపు వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తుమ్మల కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని, కాంగ్రెస్‌లోకి పోతే గెలుపు కష్టమని.. మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ వస్తుందని తెలిపారు. దీంతో స్వామి జోక్యం చేసుకొని రాష్ట్రంలో కాంగ్రెస్‌దే పైచేయి అవుతుందని అన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ విజయభేరీ సభను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, డాక్టర్ మట్టా రాగమయి పిలుపు నిచ్చారు. శుక్రవారం సత్తుపల్లిలో బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణేష్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలపై విస్తృత ప్రచారం

కొణిజర్ల: గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా వైరా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు బానోత్ బాలాజీ నాయక్ శుక్రవారం మండలంలోని బోడియా తండాలో పర్యటించారు. ఈ సందర్భంగా గడప గడపకూ తిరుగుతూ.. సోనియమ్మ సారె పేరుతో చీరలు అందించి కాంగ్రెస్ చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరించాడు. ఆయన మాట్లాడుతూ.. విజయభేరీ సభను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను విజయభేరి సభలో సోనియమ్మ ప్రకటిస్తారని తెలిపారు.

పోషకాహారంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్లు

సత్తుపల్లిరూరల్: పోషకాహార మాసోత్సవాలలో భాగంగా సత్తుపల్లి మండలం కాకర్లపల్లి-1 అంగన్‌వాడీ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. పోషకాహారం లోపం వల్ల వచ్చే వ్యాధులు, తక్కువ ఖర్చుతోనే ఎక్కువ పోషకాలు అందే ఆహారంపై చర్చించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్లు శిరోమణి, రాజ్యలక్ష్మి, సంధ్యారాణి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో కాంగ్రెస్, సీపీఎం పార్టీల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుడు దొంతిబోయిన వెంకట్రావుపై సీపీఎంకి చెందిన కొంత మంది వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేయడంతోపాటు మెడికల్ షాపును ధ్వసం చేశారు. దీంతో గాయలపాలైన వెంకట్రావును 108లో బోనకల్ పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పెనుబల్లి: పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. శుక్రవారం సూర్యనారాయణ భవనంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరావు, నాగమణి, ధనలక్ష్మి, లక్ష్మి, నీల మ్మ, రాధా, ఉమాకుమారి, రాజమ్మ పాల్గొన్నారు.

టీషర్టులు వితరణ..

కారేపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడోత్సవాల్లో భాగంగా.. కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు శుక్రవారం టీషర్టులను వితరణగా అందించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పవన్‌కుమార్, పీఈటీలు మోసామొహినుద్దీన్, రమేష్, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ముదిగొండ: మండలంలోని వల్లభికి చెందిన నెట్ సెంటర్ నిర్వాహకుడు ఎడపల్లి బద్రి(30) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామంలో నెట్ సెంటర్ కేంద్రాన్ని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్నం సమయంలో తీవ్రమైన గుండెనొప్పితో రావడంతో షాపులో కుప్పకూలి మృతిచెందాడని స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

విద్యుత్ శాఖ అనుమతి పొందాలి



ఏడీఈ అనురాధ

మధిర: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాలని విద్యుత్ శాఖ మధిర సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎం.అనురాధ తెలిపారు. శుక్రవారం స్థానిక ఏడీఈ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మధిర మున్సిపాలిటీ, టౌన్ సెక్షన్ పరిధిలోని ఆత్కూరు, నక్కలగరుబు, రాయపట్నం, మహదేవపురం, ఇల్లూరు, దేశినేనిపాలెం, అల్లీనగరం, బయ్యారం గ్రామాల్లో ఏర్పాటు చేసే మండపాల విద్యుత్ అలంకరణకు సంబంధించి మధిర టౌన్ సెక్షన్ అనీల్ కుమార్ 9440811552, ఫోర్ మెన్ రఘు 9441712514 నంబర్లను సంప్రదించాలన్నారు. అదే విధంగా మధిర మండలంలోని ఇతర గ్రామాల్లో ఏర్పాటు చేసే మండపాలకు మధిర రూరల్ అసిస్టెంట్ ఇంజనీర్ కె.నాగేశ్వరరావు 9491058652, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ 9908403394 సంప్రదించాలని కోరారు. మండపాలకు వినియోగించే లోడుకు తగిన రుసుము చెల్లించి రసీదు పొందాలన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా మండపాల్లో విద్యుత్ వినియోగిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఘనంగా ఇంజనీర్స్ డేవేడుకలు



సత్తుపల్లిరూరల్: విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, విద్యార్థులు

కొణిజర్ల/సత్తుపల్లిరూరల్: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో, సత్తుపల్లి మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలతో పాటుగా గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాత సివిల్ ఇంజనీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా కళాశాలలో విశ్వేశ్వరయ్య విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సివిల్ ఇంజనీరింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత విశ్వేశ్వరయ్యదేనని అన్నారు. ప్రతీ ఇంజనీరింగ్ విద్యార్థి విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని గొప్ప ఇంజనీర్లుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమాలల్లో ప్రిన్సిపల్ జి.జాన్‌బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చిన్నయ్య, అకడమిక్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆయేషా తరుణమ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, ప్రైమ్ అమెజాన్ డేటా ఇంజనీర్ కె.భరత్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ అన్విద, కళాశాల సెక్రటరీఅండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి, చీఫ్‌కౌన్సిలర్ కె.వి.జవహర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సీతారాములు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.